
# రచయిత పరిచయం



పేరు : కళారత్న డాక్టర్ బిక్కీ కృష్ణ గారు

పుట్టిన తేదీ : 8 .8. 1964

తల్లిదండ్రులు: బిక్కీ హనుమంతప్ప, వి బిక్కీ భీమక్క

ఊరు : అనంతపురం జిల్లా, కళ్యాణదుర్గం తాలూకా, శెట్టూరు మండలం, వడ్డేపాళ్యం గ్రామం

చదువు : ఎం.ఏ, ఎం.ఇడి, యంఫిల్, ఎం.బి.ఏ., డి.హెచ్.పి

వృత్తి : ప్రోగ్రాం హెడ్ మెట్రో ఛానల్ సీఈవో ఎన్జీవోస్ నెట్ వర్క్ హైదరాబాద్

పదవులు :

- అధ్యక్షులు నవ్యాంధ్ర రచయితల సంఘం
- భారతీయ సాహిత్య అనువాద ఫౌండేషన్
- జాతీయ ప్రధాన కార్యదర్శి సీఈవో ఎన్జీవోస్ నెట్వర్క్
- ప్రధాన కార్యదర్శి అరిగిపూడి పూర్ణచంద్రరావు ఫౌండేషన్
- గిడుగు రామ్మూర్తి పంతులు ఫౌండేషన్
- జై ని ఇంటర్నేషనల్ ఫౌండేషన్
- విశ్వ శ్రీ ఫౌండేషన్
- సైమన్ ఫౌండేషన్
- రాజా వాసిరెడ్డి ఫౌండేషన్ మొదలగునవి

ప్రవృత్తి :

- సాహిత్య సృజన
- కళా సేవా రంగాల సేవలు
- దసరా కవి సమ్మేళనాల నిర్వహణ
- నూతన కళాకారులను కవులను ప్రోత్సహించడం

ముద్రిత రచనలు: చరమగీతం, వేకువ పిట్టలు,చినుకు,
ప్రేమాంజలి ఇలా ఎన్నో రాసారు.
ఎన్నో సినిమా గీతాలు రాసారు.

విమర్శ గ్రంథాలు:

- భావన,
- ఇండియా టుడే సమీక్షణం
- అనంత శోభ
- కొత్త కోణం
- కవిత్వం-డిక్షన్
- వికసించే అవకాశాలు
- తులనాత్మక పరిశోధన
- కథా -కథనం
- నవలా శిల్ప సౌందర్యం
- గజల్ సౌందర్యం సమీక్షణం
- విభావరి
- గేయ కవుల పరిచయం
- సముద్రం నిద్రపోతుంది

ఇలా ఎన్నో రచనలు చేసారు.చేస్తూనే ఉన్నారు.

అవార్డులు -రివార్డులు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము నుండి ఉగాది పురస్కారం సభ సామ్రాట్ కళా రత్న భగీరథ జాతీయ పురస్కారం, పోతూరి మాణిక్యమ్మ జాతీయ పురస్కారం, దాశరధి పురస్కారం గురజాడ జాతీయ పురస్కారం, జనరంజక కవి పురస్కారం, దాసరి పురస్కారం, ఇంటర్నేషనల్ సర్వీస్ లెజెండ్ అవార్డు సేవరత్న అంతర్జాతీయ అవార్డు, దాసరి ఫిల్మ్ అవార్డ్స్, బోయి భీమన్న పురస్కారం, గుర్రం జాషువా జాతీయ పురస్కారం, గిడుగు జైనీ, విశ్వపుత్రిక, విశ్వ శ్రీ కళావేదిక ఎన్నో ఫౌండేషన్స్ నుండి సత్కారాలు అందుకున్నారు

ఒక గొప్ప కవిని, మానవతావాదిని, సంస్కర్తని, బహుముఖ ప్రజ్ఞాశాలిని పరిచయం చేసినందుకు గర్విస్తున్నాను. వారి వివరాలు తెలిపి మాతో సహకరించినందుకు గౌరవనీయులు కృష్ణ బిక్కి గారికి ధన్యవాదాలు.

డాక్టర్ రాధా కుసుమ

సంపాదకులు

కుసుమ జయభేరి పత్రిక

# జగన్మాత అంశయే ఆడజన్మ

ఓ మహిళ నీ సహనము మరువరానిదమ్మ, ఓ మహిళ,,
ఈ జగాన నీ కన్నా వేరే దైవమేదమ్మా,, ఓ మహిళ,,
ఆడపిల్లవని నిన్ను చీదరించుకున్నా
నీవు అనురాగము పంచుతావమ్మా, ఓ మహిళ,,
కడుపులో ఆడపిల్లవని తుంచాలని చూస్తారు
రక్తం ముద్దగా నీవు ప్రపంచాన్ని చూడాలని ఆరాట పడతావు,, ఓ మహిళ,,
మహిళలే లేకుంటే మానవ జన్మె క్కడిదమ్మా
ఈ మానవాళి నారి శక్తిని గుర్తించేది ఎన్నడమ్మా , ఓ మహిళ,,
పుడమిలోన పురుడు పోసుకొని నీవు
పునర్జన్మ ఎత్తుతావమ్మా,, ఓ మహిళ,,
ధరణి కన్నా దయగల త్యాగమూర్తి నీవమ్మ
చెల్లిగాను అక్కగాను చేయూతనిస్తావమ్మా,,
అమ్మగాను నీ చనుపాల అమృతాన్ని అందిస్తావమ్మా ఓ మహిళ,,
మహాకవుల మునుల యోగేంద్రుల దైవ స్వరూపులను
లోకానికి అందించిన ఆదిశక్తి నీవమ్మా,, ఓ మహిళ,,
డాక్టర్లను ఇంజనీర్లను శాస్త్రజ్ఞులను మహాత్ములను అందించినావమ్మ,, ఓ మహిళ,,
దేశ రక్షకులను నాయకులను అన్నదాత రైతులను అందించిన
జాతిరత్నంజీవన జ్యోతివి నీవమ్మా,, ఓ మహిళ,,
యమునా కృష్ణ గోదావరి గంగమ్మ నీ వమ్మా,
భరతమాతవు సకల దేవతలకు నిలయమైన గోమాతవు నీవమ్మా,, ఓ మహిళ,,
సృష్టిని సృష్టించిన జగన్మాతవు నీవమ్మా,,
పరమశివునిలో అర్ధనారీశ్వరి ఆదిశక్తి నీవమ్మా,, ఓ మహిళ,,
ఆరవైనాలుగు కళలకు కన్నతల్లి నీవమ్మా
ఆడదంటే ఆడుకునే బొమ్మ కాదు
తోడునీడగా నిలిచే జీవపభాగస్వామి నీవమ్మా
తొలి దేవత నీవమ్మా, ఓ మహిళ నీ సహనం వెలకట్టలేనిదమ్మా
ఈ జగాన నీ కన్నా వేరేదైవమేముందమ్మా,, మహిళ,



## మిరియాల లక్ష్మీ

# శ్రీ ఘంటసాల గారి పాటలు "జీవనది" లాంటివి...

## ఘంటసాల జయంతి సందర్భంగా తిరుపతిలో



**తిరుపతిలో** బుధవారం గాన గంధర్వులు శ్రీ ఘంటసాల మాస్టారు గారి 103వ జయంతిని పురస్కరించుకొని ఘంటసాల గానకళాపీఠం అధ్యక్షులు మల్లం విజయ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం గారు బిజెపి నాయకులు నవీన్ కుమార్ రెడ్డి గారు గుండాల గోపీనాథ్ రెడ్డి గారు ఫిలిం సొసైటీ అధ్యక్షులు వేణుగోపాల్ రెడ్డి గారు ఇతర కళాకారులు అభిమానులు, ఘంటసాల గారి విగ్రహానికి పూలమాలలు వేసి హారతులు ఇచ్చి ఘన నివాళులర్పించారు.




ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...

తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి సన్నిధిలో సుప్రభాత సేవ నుంచి పవళింపు సేవ వరకు శ్రీ ఘంటసాల మాస్టర్ గారు పాడిన పాటలు సూర్యచంద్రులు ఉన్నంతవరకు చిరస్మరణీయమన్నారు

ఘంటసాల గారి పాటలు జీవనది లాంటివిని తరాలు మారినా ప్రతి ఒక్కరి హృదయాలలో అలనాటి పాటలు ఆణిముత్యాల్లా చెరగని ముద్ర వేసుకున్నాయన్నారు...

ఘంటసాల గారి పాటలకు మరణం లేదని ఎప్పటికీ సజీవంగా ప్రతి ఒక్కరి హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోయాయన్నారు




అన్నదమ్ముల మధ్య అనుబంధాన్ని అక్కచెల్లెళ్ల మధ్య ఆప్యాయతను భార్యాభర్తల మధ్య ప్రేమానురాగాలను తన పాటల రూపంలో హృదయాలను హత్తుకునేలా పాడిన ఘనత శ్రీ ఘంటసాల మాస్టారు గారికే దక్కుతుందన్నారు

శ్రీ ఘంటసాల మాస్టారు ప్రియ శిష్యులు శ్రీ సోము ఉమాపతి గారిని ఈ సందర్భంగా శాలువతో సత్కరించారు...

**నవీన్ కుమార్ రెడ్డి**

**బిజెపి నాయకులు**



# కలాలు, గళాలు కలగలిపి వస్తున్నాయ్!

వస్తున్నాయి వస్తున్నాయి కలాలు గళాలు కలగలిపి వస్తున్నాయ్!
విజ్ఞానంతో పోరాడి గెలవలేక,
అజ్ఞానంతో గుండెల పై గన్నులు పేలుస్తారా?

అక్షర సైనికులు నిజాలు రాస్తే చంపేస్తారా?

మీ దుర్మార్గాలను అంతం చేయగా పందెం కోళ్ల వలె ఊరుకొస్తున్నాయి
చరిత్రహీనులను పెకిలించేగా
పాత పునాదులను పాతరేయగా
వస్తున్నాయి వస్తున్నాయి కలాలు గళాలు కలగలిపి వస్తున్నాయి!

బంగారు భవితకు బాటలు వేయగా
రేపటి చరితను రాయగా
భావితరాలకు పట్టం కట్టుటకై
వాస్తవాలను బయట పెట్టుటకై
కులం కుళ్ళును మతం మత్తును వదిలించేయాగా
వస్తున్నాయి వస్తున్నాయి కలాలు గళాలు కలగలిపి వస్తున్నయ్!

అన్యాయాలను ఎదిరించుటకై
అక్రమార్కుల గుట్టు విప్పి మట్టి కరిపించుటకై
కవులు గాయకులే దేశభక్తులై
దేశ ప్రగతిని ముందుకు నడిపించుటకై
వస్తున్నాయి వస్తున్నాయ్ కలాలు గళాలు కలగలిపి వస్తున్నాయ్!!



రచన
**మాన్యపు భుజేందర్.**
(శ్రీ పోతన సాహిత్య కళావేదిక వ్యవస్థాపక అధ్యక్షులు)
బమ్మెర జనగామ
చరవాణి 6302573403

ధారావాహిక

భాగం -1

# చైతన్య స్రవంతి

(సాంఘిక నవల)



డా. జి.భవానీ కృష్ణమూర్తి

కిటికీ దగ్గర నిలబడి బయటికి బయటికి చూస్తున్నాడు, కృష్ణ చైతన్య. అతని చూపులు నిర్జీవంగా, నిస్తేజంగా ఉన్నాయి..

'ఇష్టం లేకపోయినా ఈ పెళ్లి చేసుకోవలసిన వచ్చినందుకు మనసంతా చిరాకుగా వుంది.

స్వప్న అందగత్తె అయినా అవిటిది. ఆమెతో జీవితాంతం గడపాలి..



అసలు... తను జీవితంలో స్థిరపడ్డాక, కొన్నాళ్ళు ఆగి నచ్చిన అమ్మాయిని పెళ్లి చేసుకోవాలనుకున్నాడు. రియల్ ఎస్టేట్ రంగంలో రాణించాలనుకున్నాడు.... కానీ... ఈ విధంగా... రామానుజం...

"తల విదిలించి, తలమీదున్న జీలకర్ర బెల్లం, మెడలో దండలు తీసేసి, డస్ట్ బిన్ లో పడేసి, వెళ్లి స్నానం చేసి, బట్టలు మార్చుకున్నాడు. మంచం మీద వాలి, వేళ్ళతో కణతలు రుద్దుకుంటూ, మళ్ళీ ఆలోచనలో పడ్డాడు.

తలుపు చప్పుడు కావడంతో ఆలోచనల నుంచి తేరుకొని "కమిన్" అంటూ, లేచి కూర్చున్నాడు.

డాక్టర్ శ్యామల లోపలికి రావడం చూసి "డాక్టర్!.. మీరేంటి ఇలా... కూర్చోండి " కుర్చీ చూపించాడు.

"ఇట్స్ ఓకే! నేను కూర్చోడానికి రాలేదు చైతన్యా... నువ్వు ఆ విషయం తెలిసే ఈ పెళ్లి చేసుకున్నావా?" సూటిగా అడిగింది డాక్టర్ శ్యామల.

"ఏ విషయం? నాన్న గారి ఆరోగ్యం గురించా? ఇప్పుడు బాగానే ఉన్నారుగా?" ఆందోళనగా అడిగాడు.

"మీ నాన్నగారి గురించి కాదు.. ఆ స్వప్న గురించి..."

దీర్ఘంగా నిట్టూర్చి "తెలిసే చేసుకున్నాను ఆంటీ. ఆ రామానుజం నాన్నని బిజినెస్ లో దెబ్బ తీశాడు. రెండు కోట్లు వెంటనే కట్టమంటున్నాడు, లేకపోతే కోర్టుకి వెడతానంటున్నాడు. అందుకేగా నాన్నకి హార్ట్ ఎటాక్ వచ్చింది. తన కూతుర్ని పెళ్లి చేసుకుంటే ఆ డబ్బు కట్టక్కర్లేదు అన్నాడు. అందుకే స్వప్న అవిటిది అని తెలిసినా చేసుకున్నాను." అన్నాడు.

"ప్చ్... నేను చెప్పేది ఆ విషయం గురించి కాదు...ఇవన్నీ నాకూ తెలుసు కదా!"

"మరి...?." చైతన్య కనుబొమలు ముడిపడ్డాయి.

"స్వప్న గర్భవతి"

"వాట్.... మీరు చెప్పేది...?."

"నిజం.. ఆమెని పరీక్ష చేసి.. ఇలా వచ్చాను"

"మై గాడ్! అందుకా.?... అంత తియ్యగా మాట్లాడుతూ.. పెళ్లి చేసుకుంటే డబ్బు కట్టక్కర లేదు...కేసు ఉండదని.... ఛ,! మరోసారి... నక్కజిత్తులు ప్రదర్శించాడు.. గ్రహించలేక పోయాను.." బయట కారిడార్ లోకి వెళ్లి, కిందకి చూస్తూ, ఫ్రూట్ జ్యూస్ సర్వ్ చేస్తున్నతన్ని పిలిచి, రామానుజాన్ని రమ్మని కబురు పంపాడు.

ఐదు నిముషాలో రామానుజం ఆ గదిలోకి వచ్చాడు.

చైతన్య తలుపులు మూసి "అంకుల్!... మరోసారి ఎందుకింత మోసం చేశారు?" కోపం ఆపుకుంటున్నట్లు అతని దౌడ ఎముకలు బిగుసుకున్నాయి.

"మరోసారి... మోసం.?.... వాట్ నాన్సెన్స్ ఆర్ యూ టాకింగ్?"

"అంత బరువైన పదాలొద్దు. డబ్బుకోసం కాకపోయినా స్వప్న మంచిపిల్ల.. మొదటి నుంచి ఎరుగున్నది అని, అమ్మా నాన్న వద్దంటున్నా మీ ఆఫర్ ని అంగీకరించాను... కానీ.. కానీ.. ఛ మీ ఉదారత్వం వెనుక ఇంత.."

"ఆపు.. విషయం చెప్పు" అసహనంగా అన్నాడు రామానుజం.

"ఆపండి మీ నాటకాలు.. నేనూ అరవగలను మీ కంటే పెద్దగా....మీ కూతురు గర్భవతి అని ముందే నాకెందుకు చెప్పలేదు... అలా చెప్పక పోవడం... మోసం కదా "?

"స్టాపిట్.. నాన్ సెన్స్... ఇదే మరొకడు అని ఉంటే..." చైతన్య కాలర్ పట్టుకోబోయి ఆగిపోయాడు.

అంతవరకూ మౌనంగా ఉన్న శ్యామల "అవును రామానుజంగారూ!స్వప్న గర్భవతి" చెప్పింది.

"ఆపండి.... నా కూతురు మీద అనవసరంగా నిందలేస్తే...."

"ఆ అవసరం ఇక్కడెవరికీ లేదు రామానుజంగారూ. నిజం. ఇప్పుడే టెస్ట్ చేసి వస్తున్నాను.. నేను వీళ్ళ ఫ్యామిలీ డాక్టర్ ని, బంధువుని. కనుక ఇతనికి చెప్పడం నా బాధ్యత అని వచ్చి చెప్పాను"

"ఒకవేళ అది నిజం కాకపోతే..."

"నేను నా వృత్తి మానేసి, నా డిగ్రీని చింపి పారేస్తాను.... ఒక్క నిముషం.. ఇప్పుడే వస్తాను" అంటూ గబా గబా కిందకి వెళ్లి, కార్ లో కూర్చుని స్టార్ట్ చేసి, వెళ్లి ప్రెగ్నెన్సీ కన్ఫర్మ్ కిట్ తెచ్చింది.

"చైతన్యా!ఏమిటిదంతా?"అడిగాడు రామానుజం.

"అది నేను మిమ్మల్ని అడగాలి"

"నిజంగా నాకేమి తెలియదు. ఇప్పటికీ నాకు నమ్మకం కలగడం లేదు".

"అబద్ధం చెప్పాల్సిన అవసరం ఆంటీకి ఎందుకుంటుంది?"

"చైతన్యా!కిందకి రా" శ్యామల ఫోన్ లో చెప్పడంతో

"పదండి. డాక్టర్ పిలుస్తున్నారు"మెట్లు దిగి,కింద స్వప్న ఉన్న రూమ్ లోకి వెళ్ళారు.

అక్కడ స్వప్న, తల్లి కమల, డాక్టర్ మాత్రమే ఉన్నారు.

టెస్ట్ రిజల్ట్స్ వారికి చూపించింది..... పాజిటివ్...

కూతురు జుట్టు పట్టుకుని "ఎవ్వడువాడు?" బలంగా చెంపమీద కొట్టాడు.

"బిడ్డని చంపేస్తారా?" కూతుర్ని దగ్గరకి తీసుకుంది, తల్లి కమల.

చైతన్య రామానుజాన్ని వెనక్కి లాగి "అంకుల్! తిడితే... కొడితే పరిష్కారం అయ్యే సమస్య కాదిది" అన్నాడు.

# రమా వెన్నెలలు

అనుబంధాలకు విలువలు
ఆకాశమంత అన్నది నిజమే
ఒకరికొకరై కలిసుంటే చాలు
పెరుగు కొండంతన్నది వాస్తవమే

వ్యక్తిత్వం గొప్పదైతే చాలు
నీ స్నేహం కోరుతూ వస్తారు
నీకత్యంత ఆప్తులవుతారు
నీ కష్ట సుఖాల్లో భాగమవుతారు

మరపురాని తీయని జ్ఞాపకాలు
మది నిండా బాల్యపు ఆనవాలు
మళ్లీ రావాలని కోరే ఆశల కుసుమాలు
కావాలన్నా తిరిగి చేరలేని తీరాలు.

**రమాదేవి బుక్కపట్నం**



"దాన్ని కాదే.. అసలు.. నిన్ను కొట్టాలి. కూతురు ఎప్పుడు ఏం చేస్తోందో పట్టించుకునే తీరిక లేదుగానీ, ఒంటి నిండా నగలు దిగేసుకుని, క్లబ్బులు, మహిళామండలి అంటూ, దేశాన్ని ఉద్ధరించడానికి టింగురంగా అంటూ బయలుదేరుతావు." భార్య మీద అరిచాడు రామానుజం.

"చెప్ప వాడెవడు.?. లేకపోతే నిన్ను ఇప్పుడే.. ఇక్కడే చంపేస్తాను" కూతురు గొంతు పట్టుకున్నాడు..

"రామానుజంగారూ! దానివల్ల సమస్య పోదు పెద్దది అవుతుంది" అంది శ్యామల.

"డాక్టర్!ఇది మా కుటుంబ సమస్య. మీరు వెళ్ళండి. ఈ విషయం బయటికి రాకుండా చూసే బాధ్యత మీదే. రేపు మీ నర్సింగ్ హోమ్ కి తీసుకొస్తా అబార్షన్ కి. ఇంక మీరు బయలుదేరండి" తలుపు తెరిచి, శ్యామలను వెళ్ళమన్నట్లు చూశాడు రామానుజం.

ఆవిడ వెళ్ళాక మళ్ళీ తలుపు మూసి, "చెప్పి చావ్వే! వాడెవడు?" కొట్టబోతే తల్లి అడ్డొచ్చి

"దాన్ని చంపేసేలా ఉన్నారు.. ఆగండి" అరిచింది.

"దాన్ని కాదు, ముందు నిన్ను చంపాలి...."పక్కకి తోసి, కూతురు ముందు పెద్ద పులిలా నిలబడ్డాడు. అతనికి ఈ అవమానం తల కొట్టేసినట్లుగా ఉంది.

"రంగరాజు"అంది వెక్కుతూ.

"రంగరాజు.. అంటే. మీ ఆఫీసులో క్లర్క్ కదా "అన్నాడు చైతన్య.

"అవును. అప్పుడప్పుడు ఇంట్లో సరుకులు తేవడానికి, బజారు పన్లకి ఈవిడ పిలుస్తుంటుంది. తరచుగా ఇంటికి వస్తుంటాడు "చెప్పాడు రామానుజం.

"అరిచి మీరే నలుగురిలో నవ్వుల పాలు చేసేలా ఉన్నారు" భార్య మాటలకి కోపం వచ్చి

"ఛ్ఛత్!నువ్వు నోర్ముయ్!.."

చైతన్య భుజం మీద చెయ్యి వేసి, "సారీ చైతన్యా!ఈ విషయం నాకు ఇప్పుడే తెలిసింది "అన్నాడు.

"ఆ విషయం నాకు అర్ధం అయింది... కానీ.... శరీరానికి అపవిత్రతనం అయినా నేనూ పట్టించుకోలేదు... నాది కాని బిడ్డకు తండ్రినయ్యేంత పెద్ద మనసు నాకు లేదు.... మీరు మీ అమ్మాయిని.. మీ ఇంటికి తీసికెళ్ళిపోవచ్చు "స్పష్టంగా చెప్పేశాడు.

"అలా అంటే ఎలా?" గట్టిగా అరిచింది.

"అంటే.. ఎవరి బిడ్డకో నేను తండ్రిని కావాలా?" అన్నాడు చైతన్య, కోపంగా.

"అబార్షన్ చేయిస్తారు కదా"

"చేయిస్తే? మీ అమ్మాయి కన్య అయిపోతుందా? నేనూ మరొకరితో సంబంధం పెట్టుకుని బిడ్డను కంటే మీ కూతురికి ఓకే యేనా?"

"అలా ఎలాకుదురుతుంది?"

"అలాగే ఇదీ కుదరదు. మీరు మీ అమ్మాయిని తీసికెళ్ళిపోవచ్చు."

రామానుజం దీర్ఘంగా నిట్టూర్చి "ఇప్పుడు వెంటనే తీసికెళ్ళిపోతే నలుగురు నాలుగు రకాలుగా అనుకుంటారు. కొన్నాళ్ళు ఇక్కడే ఉండనివ్వు." అన్నాడు రామానుజం, బ్రతిమలుతున్నట్లుగా.

"అలా ఎలా కుదురుతుంది?"అన్నాడు విసుగ్గా.

""కొన్నాళ్ళు ఇక్కడ ఉంటే.. నాతో కాపురం చేసి కడుపు తెచ్చుకుంది అనుకుంటారు అందరూ"

"అది కాదు చైతూ... మా బాధ అర్ధం చేసుకో... కొద్ది రోజులు.."బ్రతిమాలాడు.

"సరే. సాధ్యమైనంత త్వరగా తీసికెళ్లండి. అమ్మా, నాన్న ఇక్కడే కొన్నాళ్ళు ఉంటారు. వారితో మీ అమ్మాయి ఉంటుంది... నేనీరోజే హైదరాబాద్ వెళ్లిపోతున్నా. మళ్ళీ మీ అమ్మాయి ఈ ఇంటి నుంచి వెళ్ళాకే తిరిగి వస్తాను. అమ్మ పెద్దది. మీ అమ్మాయికి సేవలు చేయలేదు. మీ పనిమనిషిని ఇక్కడే ఉంచండి. మీ అమ్మాయి మీదున్న జాలితో, స్నేహధర్మంగా ఇందుకు ఒప్పుకుంటున్నాను" స్వప్న దగ్గరగా వెళ్లి "మీ నాన్నతో చెప్పడానికి భయం అయితే, నాతో అయినా చెప్పాల్సింది., అప్పడు నీకు నచ్చినవాడితోనే నీ పెళ్లి జరిపించేవాడిని," అనేసి, తలుపుతీసి బయటికి వచ్చి మళ్ళీ తలుపులు మూసేశాడు.

"చైతూ! ఏమైంది నాన్నా?"అడిగాడు తండ్రి రాఘవరావు.

"ఏం లేదు నాన్నా! ఉన్న అతిధుల్ని తొందరగా పంపేయండి...."చెప్పి పైనున్న తన గదిలోకి వెళ్ళిపోయాడు.చైతన్య.

మరో గంటకి ఒక సూట్ కేస్ తో దిగి వచ్చి," నాన్నా!నేను అర్జన్ట్ గా హైదరాబాద్ వేడుతున్నాను. కొన్నాళ్ళు అయ్యాక వచ్చి, మిమ్మల్ని తీసికేడతాను. తరువాత ఫోన్ లో మీతోమాట్లాడతాను., మీరు అతిధుల్ని చూసుకోండి "చెప్పేసి, సమాధానం కోసం చూడకుండా బయటికి వెళ్ళిపోయాడు.

****

విజయవాడలో ఒక వస్త్ర వ్యాపారి అయిన రాఘవరావు, గోదావరి జిల్లాలోని ఒక సామాన్య రైతు కుటుంబంలోని రెండవ సంతానం. వ్యవసాయం చెయ్యడం ఇష్టంలేక విజయవాడలోని ఒక కంపెనీలో ఉద్యోగంలో చేరాడు. కొన్నాళ్ళు అయ్యేసరికి ఒకరి చేతి కింద పని చేయడం నచ్చక, సహోద్యోగిగా పరిచయం అయిన రామానుజం భాగస్వామిగా బట్టల

వ్యాపారం ప్రారంభించాడు.ఇద్దరూ ఉద్యోగాలు మానేశారు. రామానుజం తన అన్నగారి పాలవ్యాపారంలో కూడా భాగస్వామి కావడంతో బట్టల వ్యాపారం రాఘవరావు చూసుకునేవాడు.

అనతికాలంలోనే వ్యాపారం బాగా పుంజుకుంది.

విజయవాడ నగరశివార్లలో స్థలం కొని, ఇల్లు కట్టుకోడమే కాక కూతురు కార్తీకకు సాఫ్ట్ వేర్ ఉద్యోగితో పెళ్ళి జరిపించి, అమెరికా పంపించాడు, రాఘవరావు.

కొడుకు కృష్ణచైతన్య హైదరాబాద్ లో సివిల్ ఇంజనీరింగ్ లో జాయినయ్యాడు. అతని కాంట్రాక్టర్ గా రియల్ ఎస్టేట్ బిజినెస్ చెయ్యాలని కోరిక. ఆ విషయం విని రామానుజం హైదరాబాద్ లో రియల్ ఎస్టేట్ బిజినెస్ చేస్తున్న తన మిత్రుడికి చైతన్యని పరిచయం చేసి, అవకాశం ఉన్నప్పుడు వెళ్లి, వర్క్ నేర్చుకోమని సలహా ఇచ్చాడు.

****

అంతా సవ్యంగా ఎప్పుడూ జరగదు.కాలం తన ప్రతాపం చూపక మానదు కదా.

అల్లుడు రాహుల్ కి కేన్సర్ అని తెలిసి, కూతురు బాధ పడుతుంటే రాఘవరావు, భార్య జానకమ్మ అమెరికా వెళ్లారు. బట్టల వ్యాపార బాధ్యత రామానుజం చూసుకుంటానన్నాడు.

అక్కడికి వెళ్లి ఆరునెలలు పూర్తి కాగానే తిరుగు ప్రయాణం అనుకుంటుంటే కరోనా కారణంగా లాక్ డౌన్ ప్రకటించడంతో ప్రపంచదేశాల మధ్య రాక పోకలు నిలిచిపోయాయి.

వరద ఉధృతిలా కరోనా కేసులు, మరణాలు ప్రజలను వణికించాయి.

ఏడాది దాటాక స్వస్థలానికి తిరిగి వచ్చారు రాఘవరావు దంపతులు.

రామానుజం చెప్పిన మాట వినగానే రాఘవరావుకి హార్ట్ ఎటాక్ వచ్చింది. తల్లిదండ్రుల్ని దిగబెట్టి, తిరిగి హైదరాబాద్ వెడదామని బయలుదేరుతున్న చైతన్య ఆగిపోయాడు.

కరోనా కారణంగా మూతపడిన వ్యాపారం, రామానుజంకీ కరోనా రావడంతో మరింతగా నష్టం వచ్చింది.

దానితో తన భాగస్వామ్యాన్ని రద్దు చేసుకుంటున్నట్లు, తన పెట్టుబడి సొమ్ముని తిరిగివ్వమని, లేని పక్షంలో కోర్టుకి వెడతానని చెప్పాడు రామానుజం.

రాఘవరావుకి ప్రాణాపాయం తప్పినా ఎటువంటి ఆందోళన పనికి రాదని డాక్టర్స్ హెచ్చరించారు.

చైతన్య రామానుజం ఇంటికి వెళ్లి అతనితో మాట్లాడాడు.

కాసేపు కుశల ప్రశ్నలు, పరామర్శలు అయ్యాక "అంకుల్! మీరు నాన్న కలిసి బిజినెస్ చేశారు. పెట్టుబడి పెట్టిన నిష్పత్తిలోనే ఏటేటా లాభాలు కూడా పంచుకున్నారు. ఇప్పుడు నష్టం వస్తే అదీ ఇద్దరూ పంచుకోవాలి కదా. మొత్తం మీరు పెట్టుబడి పెట్టిన సొమ్ముని తిరిగి ఇవ్వాలని, భాగస్వామ్యాన్ని కేన్సిల్ చేసుకుంటున్నానని అనడం ఎంతవరకు న్యాయం.?" సీరియస్ గానే అడిగాడు.

"న్యాయన్యాయాల సంగతి నాకు అనవసరం. నేను 70శాతం పెట్టుబడి పెట్టాను. మేజర్ పార్ట్ నాది కనుక నా సొమ్మునేను అడుగుతున్నాను. కరోనా మూలంగా పాలవ్యాపారంలో కూడా కోలుకోలేని దెబ్బతగిలింది.

పాడి పశువులు చాలా చనిపోయాయి. పాలు నిత్యావసరం కనుక మళ్ళీ ఆ వ్యాపారం పుంజుకుంటుందని ఆశ. అందులో నష్టాన్ని పూడ్చుకోడానికి నాకు డబ్బు అవసరం. అందుకే..

ఇందులో నుంచి భాగస్వామిగా తప్పుకోవాలనుకుంటున్నాను." స్పష్టంగా చెప్పాడు రామానుజం.

"రెండు కోట్లు తండ్రి ఎక్కడినుంచి తేగలడు?"ఆలోచనలో పడ్డాడు చైతన్య.

"అకౌంట్ బుక్స్ నాకు పంపమని అక్కంటెంట్ కి చెప్పండి. మరో ఆడిటర్ చేత చెక్ చేయిస్తాను. స్టాక్ ఎంత ఉందో మేనేజర్ ని కనుక్కుంటాను. ఉన్న స్టాక్ ఎవరికైనా హోల్ సెల్ గా ఇచ్చేస్తే..."

"అవి లాక్ డౌన్ టైమ్ లో గోడౌన్స్, షాప్స్ మూసి ఉంచడం వల్ల ఎలుకలు కొరికేశాయి. చాలా వరకూ అవన్నీ బీద బిక్కికి ఇచ్చేశాం. అకౌంటెంట్ కరోనాతో చనిపోయాడు. బుక్స్ గురించి నాకు తెలియదు అంటోంది వాళ్ళావిడ."

"అవి ఆఫీసులో కదా ఉంటాయి" అసహనంగా అన్నాడు చైతన్య.

"సడన్ గా లాక్ డౌన్ ప్రకటించారు కదా. కొన్ని అకౌంట్స్ చెక్ చేయాల్సిఉందని బుక్స్ అన్నీ ఇంటికి తీసికెళ్లాడు. అతనికి కరోనా రావడం చనిపోవడం, ఆమె పుట్టింటికి వెళ్లిపోవడం.. నాకు తెలియకుండానే జరిగిపోయాయి. తరువాత ఎంక్వయిరీ చేస్తే ఆమె అడ్రస్ దొరికింది.అడిగితే నాకు తెలియదని అంటోంది"

రామనుజం మోసం చేస్తున్నాడని, అందుకే ఇలా కాకమ్మ కథలు చెప్తున్నాడని అర్థం అయింది చైతన్యకి.

దీర్ఘంగా నిట్టూర్చి వెనుతిరిగి వచ్చాడు. దారిలో తండ్రికి తెలిసిన ఒక లాయర్ ని కలిసి పరిస్థితి వివరించి, సలహా అడిగాడు.

***

హైదరాబాద్ వెళ్లి ఫైనల్ ఎగ్జామ్స్ రాసి తిరిగి వచ్చాడు. అసలు హైదరాబాద్ లోనే రియల్ ఎస్టేట్ బిజినెస్ మొదలు పెట్టాలనుకున్నాడు గానీ, డబ్బుఇబ్బంది, తండ్రి ఆరోగ్యం బాగులేకపోవడంతో కేంపస్ సెలక్షన్ లో మంచి పేకేజీ తో వచ్చిన మల్టి నేషనల్ కంపెనీలో జాబ్ లో చేరడానికి నిశ్చయించుకున్నాడు.

తండ్రికి ఆవిషయం చెప్పి జాయిన్ అయ్యి, ఇల్లు చూసి తల్లిదండ్రుల్ని తీసికెళ్లాలని అనుకున్నాడు. గతంలో రామానుజం పరిచయం చేసిన అతని మిత్రుడు, కాంట్రాక్టర్ రాంప్రసాద్, చదువు అయిపోగానే తన దగ్గర ఇంజనీర్ గా జాయిన్ కమ్మని చెప్పిన విషయం గుర్తున్నా, అది ఇష్టం లేకపోయింది చైతన్యకి.రామానుజం చేసిన మోసంతో అతని మిత్రుని కూడా నమ్మాలనిపించలేదు.

తండ్రికి పరిస్థితి వివరించి చెప్పి,, మరునాడే హైదరాబాద్ వెళ్ళి జాబ్ లో జాయిన్ అయ్యాడు. ఆఫీస్ కి దగ్గరలోనే ఇల్లు అద్దెకి తీసుకుని,మళ్ళీ శుక్రవారం రాత్రికి విజయవాడ వచ్చాడు.

ఆదివారం తల్లిని తండ్రిని తీసికెళ్ళడానికి శనివారం ట్రాన్స్పోర్టు వారిని పిలిచి, ముఖ్యమైన సామాన్లు వారికి అప్పగించాడు.

శనివారమే వాచ్ మేన్ కి, పనిమనిషికి రెండు నెలల జీతం ఇచ్చి, పని మానిపించాడు.

ఆదివారం ట్రైన్ కి టికెట్స్ బుక్ చేశాడు.

ఆ రాత్రిభోజనం చేసి తండ్రితో మరునాడు ప్రయాణం గురించి మాట్లాడుతుంటే, రామానుజం దగ్గర్నుంచి ఫోన్ వచ్చింది.

"డాల్ఫిన్ హోటల్లో ఉన్నా. ఒకసారి వస్తావా.? మాట్లాడే పనుంది" అన్నాడు.

"ఇప్పుడా?"

"అవును. నువ్వు హైదరాబాద్ మకాం మార్చేస్తున్నావట కదా."

"అవును. నాకు అక్కడ జాబ్ వచ్చింది. ఆల్రెడీ జాయిన్ అయ్యాను."

"తెలిసింది. అందుకే మాట్లాడాలి."

"మాట్లాడేది ఏముంది? లీగల్ గా ప్రొసీడ్ అవుతానన్నారుగా. అలాగే కానివ్వండి.. నేను కూడా లాయర్ తో మాట్లాడాను."

"ఒకసారిరా. మాట్లాడాలి, జస్ట్ అరగంటలో వెళ్ళిపోదువు గాని" అన్నాడు రామానుజం.

బట్టలు మార్చుకుని "అలా వెళ్ళొస్తాను నాన్నా" తండ్రికి చెప్పి బయలుదేరి వెళ్ళాడు.

కాసేపు కుశల ప్రశ్నలు అయ్యాక "నీకొక ఆఫర్ ఇద్దామని రమ్మన్నాను" అన్నాడు.

"ఆఫరిస్తారా?ఏమిటది?" ప్రశ్నార్థకంగా చూస్తూ...

"మీరు నమ్మకద్రోహం చేస్తున్నారని అర్థం అవుతూనే ఉంది. నాన్న చెప్పిన దాన్ని బట్టి, ఇన్నేళ్లలో లాభాలరూపంలో మీరు పెట్టుబడి పెట్టిన దానికంటే ఎక్కువే మీకు ముట్టింది.అయినా ఇంకా రావాలి అంటున్నారు అది మోసం కదా. మీరు ఇంకేమి ఆఫర్ ఇస్తారు.?" హేళన గా నవ్వాడు.

"కూల్ మై బాయ్.... నేనేమి మోసం చెయ్యడం లేదు. అన్యాయము కాదు. న్యాయంగా నేను పెట్టుబడి పెట్టిన సొమ్ము అడుగుతున్నాను."

చైతన్య మాట్లాడ లేదు.

రామానుజం ఒక ఫోటో చైతన్య ముందు పెట్టి, "నీకు తెలుసుగా మా అమ్మాయి స్వప్న.... చిన్నప్పుడు పోలియో వచ్చింది. కాలు కొంచెం కుంటుతూ నడుస్తుంది.

నిన్ను చాలాకాలంగా చూస్తున్న వాడిని...నీలాంటి వాడి చేతుల్లో పెడితే అది సుఖంగా ఉంటుందని నా నమ్మకం. ఇంటర్ వరకూ చదివింది. ఒక్కగానొక్క కూతురు. నా తరువాత నా ఆస్థి అంతా దానిదే. నువ్వు మా అమ్మాయిని పెళ్ళి చేసుకుంటే, నేను పెట్టుబడిగా ఇచ్చిన సొమ్ము తిరిగి ఇవ్వక్కర లేదు, నువ్వు రియల్ ఎస్టేట్ బిజినెస్ చేసుకోడానికి అవసరమైన సొమ్ముకూడా నేను ఇస్తాను" చెప్పాడు.

"ఈ విషయం ఇలా బ్లాక్ మెయిల్ చేయకుండా అడిగి ఉంటే, ఒప్పుకునే వాడినేమో? నన్ను మీ అల్లుడుగా చేసుకోవాలనుకుంటే అడిగే పద్ధతి ఇది కాదు. మమ్మల్ని మానసికంగా బలహీనం చేసి,, మా నాన్న ప్రాణాలతో చెలగాటం ఆడి....."

"సారీ చైతన్య! వ్యాపారంలో నష్టం వచ్చిన మాట నిజం..."

"తెలుసు, కరోనా,... లాక్ డౌన్ కారణంగా చాలా మంది చాలా నష్టపోయారు. అందులో మనము ఉండొచ్చు. కానీ,భాగస్వామ్యం రద్దు చేసుకుంటామని, పెట్టుబడి సొమ్ము వెంటనే తిరిగి ఇవ్వాలని లేకుంటే కోర్టుకి వెడతానని బెదిరించడం, అకౌంట్స్ బుక్స్ లేవు అనడం..."

"సారీ చైతన్యా, అవన్నీ మరిచిపో... మీనాన్న, నేను... మీరు పుట్టక ముందునుంచి మిత్రులం... పాల వ్యాపారంలో కూడా నష్టంవచ్చింది. మా అన్నయ్య దగ్గర నుంచి ఒత్తిడి రావడంతో డబ్బు అవసరం అయి అలా మాట్లాడాను" అంతకు ముందు మాట్లాడినప్పుడు గొంతులో ధ్వనించిన తీవ్రత ఇప్పుడు లేదు.దాదాపు కాళ్లబేరానికి వచ్చినట్లు ఉంది అతని వ్యవహారం..

"మీరు రేపు ఇంటికి వచ్చి నాన్నతో మాట్లాడండి" అన్నాడు లేస్తూ.

"మీ నాన్నకి స్వప్న అంటే చాలా ఇష్టం "

"అవును అన్నీ సవ్యంగా ఉంటేనే చాలా మంది ఆడపిల్లల బ్రతుకులు అస్తవ్యస్తం అవుతున్నాయి.స్వప్న జీవితానికి మంచి అండ దొరకాలి అంటూ ఉంటారు. నేను వెడతాను" బయలుదేరి ఇంటికి వచ్చేసి, తండ్రికి జరిగినదంతా చెప్పాడు.

జానకమ్మ వెంటనే "వద్దు నాన్నా, మనిషి అందంగానే ఉన్నా, కాలు లేని పిల్ల... నీకు సరిజోడి కాదు. నీకు గ్లాసుడు మంచినీళ్లు కూడా అందించలేదు సరికదా, నువ్వే ఆమెకి సేవలు చెయ్యాల్సి వస్తుందేమో? చూస్తూ నేనుభరించలేను" అంది.

"అవున్రా! అంతగా అయితే ఈ ఇల్లు అమ్మేసి,ఆ డబ్బు ఇచ్చేద్దాం" అన్నాడు తండ్రి.

"ఆలోచిద్దాం లేండి. రేపు అతను వస్తాడు, మీతో మాట్లాడడానికి. వారం రోజుల్లో ఏ విషయం చెప్తానని చెప్పాను. మీరు కూడా అలాగే చెప్పండి "అని పడుకోడానికి వెళ్ళిపోయాడు.

సశేషం...

## శుభాభినందనలు...

'కుసుమ జయభేరి' మాసపత్రిక మొదటి సంచిక విడుదల చేసిన సందర్భంలో శుభాకాంక్షలు తెలుపుతూ... మున్ముందు సాహిత్యంలో ఓ సరికొత్త ఒరవడిని సృష్టిస్తూ కవుల ప్రతిభను సాహితీలోకానికి పరిచయం చేసే పనిలో విజయం సాధించాలని మనసారా కోరుకుంటూ హృదయపూర్వక అభినందనలు మేడం.



-అవ్వసలి ఆంజనేయులు



26/11/24 రాజ్యాంగ దినోత్సవ సందర్భంగా తెలుగు చైతన్య సమితి మరియు కుసుమ ధర్మన్న కళాపీఠం నిర్వహించిన కవి సమ్మేళనం మరియు సదస్సు రవీంద్ర భారతిలో...









పినాకి యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ వారి స్వచ్ఛంద సేవకులు దినోత్సవం సందర్భంగా సేవే మార్గం అనే అంశంపై కవి సమ్మేళనం

# మాయల మాటలతో

ఏమైనా జరగొచ్చు
మోహంలో మునకలేస్తూ మోదం పొందవచ్చు
మురిపాలు తాగుతూ సరాగాలు తీయవచ్చు
మనోహరమైన ఊహల్లో తేలిపోవచ్చు!!
కవ్వింతల గిలిగింతలతో,
ఒళ్లంతా తుళ్ళింతలతో, హాయిగా !
కళ్ళు అరమోడ్పులై, తెలియని మత్తుతో,
సుళ్ళు తిరుగుతూ, గందరగోళంగా!!
ఏదైనా జరగొచ్చు!
గుండె గూటిలో గులాబీలు పూయొచ్చు
మండే ఎండలు మంచు పూలై తాకొచ్చు
బండరాళ్లలో పడక,
బంతిపూలపాన్పైతోచవచ్చు!!
మంజుల మనోజ్ఞ సంగీతమై
సంజ పొద్దులో సమాగమించి
ముంజల మధువును త్రాగించి
కంజీర లయలో లయం చేయొచ్చు!!
ఏదైనా జరగొచ్చు!
మాటల మాయలో వివశుల చేసి
తోటలు, కోటలు కొట్టేయవచ్చు
మూటలు ముల్లెలు దోచవచ్చు!!

పూతేనియ అధరాల, జాలు పలుకులు!
చేయొచ్చు! చిల్లు చిల్లు చిత్తమంతా!
ఒళ్లంతా జిల్లు జిల్లు! అందనంత !
ఇల్లంతా గుల్ల గుల్ల! బాగు చేయలేనంత!
ఏదైనా జరగొచ్చు! ఏమైనా జరగొచ్చు!!



## కేశరాజు వేంకట ప్రభాకర్ రావు

# అభినందనలు

డాక్టర్ రాధా కుసుమ గారు వారి తాతగారు కుసుమ ధర్మన్న గారి మార్గంలో నడవడం గొప్ప విషయం

ఆనాడు జయభేరి అనే పత్రికను జనహితం కోసం నడిపించే వారు ఈనాడు ఈ ముద్దుల మనమరాలు కుసుమ జయభేరి అనే పత్రికను 27 పేజీలతో మన ముందుకు తెచ్చారు.

ఆనాడు జయభేరి అనే పత్రికను జనహితం కోసం తాత నడిపించేవారు. ఈనాడు మనమరాలు జయభేరి అనే పత్రికను తన మిత్రులకు శ్రేయోభిలాషులకు ప్రోత్సహించడానికి మొదలు పెట్టానన్నారు ఇది గొప్ప విషయం.

సాహిత్య సాంస్కృతిక పత్రికలో వ్యాసాలు, కవితలు, కథలు వంటిల్లు హాస్య తరంగాలు పుట్టినరోజు శుభాకాంక్షలు అనేకములు ఉన్నవి.

కుసుమ ధర్మన్న కళాపీఠం కుసుమ స్వర లహరి వంటి సమూహాలు విజయవంతంగా నడుపుతున్నారు. పత్రిక కూడా నడపాలని ఆశిస్తున్నాను.

కవితలు కథలు సమీక్షలు పరిచయాలు రంగవల్లులు సాంస్కృతి సంప్రదాయాలు నూతన పుస్తక పరిచయాలు కళలు వంటిల్లు సమ్మేళనాలు సదస్సులు, సత్కారాలు ఇవన్నీ వచ్చే పత్రికలు వస్తాయని చెప్పారు చాలా ఆనందదాయకం.

ప్రియమైన డాక్టర్ రాధా మేడమ్ గారికి మా శుభాకాంక్షలు తెలుపుతూ మీ పత్రిక దినదినాభివృద్ధి కావాలని కోరుకుంటూ ..



మీ

**శోభ దేశ్పాండే**

సెంట్ జార్జర్ డిగ్రీ అండ్ పీజీ కాలేజ్ ఫర్ ఉమెన్

(హిందీ ప్రొఫెసర్)

# అభినందనలు

కవులకు మరో అవకాశమే కుసుమ జయభేరి మాసపత్రిక కవులకు మరో అవకాశమే. ఈ మాసపత్రికలో కవులు వ్యాసాలు, కవితలు, కథలు మాత్రమే కాకుండా మహిళలల కోసం.. భోజన ప్రియుల కోసం వంటిల్లు పేరుతో కొత్త వంటకాలను పరిచయం చేయడం బాగుంది. ఉరుకులు పరుగుల జీవితంలో కష్ట ప్రయాణంలో నవ్వును కాస్త మరిచిపోయామనే చెప్పాలి.. నవ్వు నాలుగు విధాల చేటు అన్నారు నాడు. నవ్వు నాలబై విధాల మంచిదని నేడు అంటున్నారు వైద్యులు అందుకోసం నవ్వుకున్నోళ్లకు నవ్వుకున్నంతగా హస్య తరంగాలను ఏర్పాటు చేశారు. ఇంకా పిల్లలకు చిన్న చిన్న ఫజిల్స్, చిలిపి కథలు వేమన, నన్నయ్య పద్యాలు పరిచయాలు చేస్తే బాగుంటుందని కుసుమ జయభేరి మాస పత్రిక ఎడిటర్ ని విన్నవించుకుంటున్నాం..



**అమీనా కలందర్**

+++

కుసుమ జయభేరి తెలుగు సాహితి సాంస్కృతిక మాస పత్రికలో చిట్కాలు, పిండి వంటకాలు, కథలు, కుటుంబ బంధాలు, ఆధ్యాత్మికత సాహిత్య కార్యక్రమాలు అన్నీ ఆలహించి ఉన్నాయి. కుసుమ ధర్మన్న సమాజ హితం కోసం ఎలా తపించాడని తన భావాలను పేపర్లో నిరంతరము వ్యక్త పరచాలి. దీనితో పాటు ఇతర ప్రముఖ వచన, సాంస్కృతిక కవులను పరిచయం చేయాలి అక్కడక్కడ సూక్తులు కూడా చెరిస్తే బాగుంటుంది. ఫైనల్ గా చెప్పాల్సింది ఏమిటంటే కుసుమ జయభేరి పేపర్ ఎలా ఉందంటే కలకూర గంపలాగా ఉంది అని చెప్పవచ్చు.



**- మిద్దె సురేష్**
కవి, వ్యాసకర్త
9701209355

# మనుషుల్లో మృగాలు



**డా. చిటికెన కిరణ్ కుమార్**
కవి, రచయిత, విమర్శకులు
మెంబర్: ఐ. బి. ఆర్. ఎఫ్,
Cel:9490841284

**భూ**మి నుండి చంద్ర మండలం పైకి, ఒక గ్రహం నుండి మరో గ్రహం వైపు మనిషి తన మేధస్సుతో పయనిస్తుంటే... మనుషుల్లో మానవత్వ విలువలు నశించి సమాజం ఒక అడవిగా మారే క్రమం నేటి మన కళ్ళముందు కనిపిస్తున్న సంఘటనలు ప్రత్యక్ష సాక్ష్యంగా నిలుస్తున్నాయి. అమ్మగా, సోదరిగా, ఆలిగా స్త్రీ ప్రత్యేక పాత్రను పోషిస్తున్న నేటి భారతదేశంలో తన మనుగడ ఒక ప్రత్యేకమైనది. స్వతంత్రం వచ్చి 75 సంవత్సరాలు దాటుతున్నా ఇంకా స్త్రీ అణచివేయబడుతుందని ఇటీవల జరిగిన సంఘటన ద్వారా వ్యక్తం అవుతుంది. చట్టాలు ఎన్ని వచ్చినా మరి ఎందుకు ఈ సంఘటనలు జరుగుతున్నవి అనేది ఒక ప్రశ్నార్థకంగా మారింది! పనిచేసే చోట ఐతేనేమి... మరి ఎక్కడైతే నేమి తనపై కొందరి మగాళ్ళ చూపు మరో కోణంలో ఎందుకు ఉంటుంది. తనను కనిపెంచింది ఆ స్త్రీ మూర్తి అయినా కొందరిలో మరో చూపు ఆ స్త్రీపై ఎందుకుంటుంది? సభ్య సమాజం తలదించుకునే విధంగా అనేక అత్యాచారాలు, హత్యాచారాలు జరుగుతున్న నేటి తరుణంలో గడప దాటి బయటకు వెళుతున్న స్త్రీకి ఇంటి వద్ద తన తల్లి జాగ్రత్త బిడ్డా అని చెప్పని రోజు ఉన్నదా! ఒక్కసారి ఆలోచించాలి. మగాళ్లు మృగాలుగా మారి కామంతో కళ్ళు మూసుకుపోయి నీచపు చీకటి క్రీడకు బలి అవుతున్న ఎందరో మంది స్త్రీలు వేదన, ఆవేదన, జరుగుతున్నా అన్యాయాలు అనిర్వచనీయమైనది. మొన్న కలకత్తాలోని శిక్షణా మహిళా డాక్టర్ అత్యాచారం, హత్యకు గురైన సంఘటన యావత్ ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురిచేస్తుంది.



"స్త్రీ తన జననం ఒక చోట..... తన మరణం మరో చోట"

భారతీయ సంస్కృతి సాంప్రదాయాలను దృష్టిలో పెట్టుకుని ఆలోచిస్తే "స్త్రీ" తన బాల్యం నుండి వివాహం వరకు ఒకచోట, వివాహం తర్వాత నుండి మరో చోట తన జీవిత ప్రస్థానం కొనసాగుతున్న కథనం మనకు తెలిసినదే..... ఒక్కసారిగా తను పుట్టిపెరిగిన ప్రాంతం నుండి వివాహం అనే అనుబంధం ద్వారా మరో ప్రాంతంలో తన జీవన గమనం కొనసాగుతుంది. పుట్టింటి నుంచి మెట్టినింట్లో తన కొత్త జీవితాన్ని మళ్ళీ

మొదటి నుండి ప్రారంభం చేస్తుంది. ఇంతటి మార్పును ఎదిరిస్తూ కూడా మరో ప్రక్క సమాజంలో కొన్ని దుశ్చర్యలు అయినటువంటి టీజింగ్, గృహ హింస, వరకట్న వేధింపులు, విడాకులు, కుటుంబ బాధ్యతలు అంటూ రకరకాల సమస్యలను నేటికీ ఎదుర్కొంటుంది. నేటికీ స్త్రీ అణచివేయబడతుంది. లెక్కలేనన్ని చట్టాలు ప్రభుత్వం తీసుకొచ్చినప్పటికీ ఇంకా అణచివేయడం ఇలాంటి సంఘటనలు మనం పత్రికలలో సోషల్ మీడియాలో ఎన్నో చూస్తూనే ఉన్నాము. ఒక కోణంలో పరిశోధిస్తే కావలసింది సమసమాజ మార్పు, కఠిన శిక్షలు అమలులోకి రావడం ఎంతైనా అవసరము ఉన్నదని అంతర్గతంగా, బహిర్గతంగా తెలుస్తున్నది. ఆడవాళ్ళ భద్రత విషయంలో ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా వెంటనే శిక్షలు అమలు అయ్యేటట్టు అత్యాచారం, హత్యాచారం ఉదంతం జరిగదానికి సంబంధిత నిందితులను శిక్షించే విధంగా సత్వర పరిష్కారం అవసరమని చెప్పవచ్చు. అప్పుడు మరింత మన న్యాయవ్యవస్థపై అందరికీ నమ్మకం ఏర్పడుతుంది. బాధితులకు కొంతవరకు ఉపశమనం జరుగుతుందనవచ్చు . మరియు ఒక ఆడపిల్ల తప్పిపోయినప్పుడు కొన్ని దేశాల్లో మాదిరిగా పోలీసు వ్యవస్థతో పాటు ఇతర గ్రూపులు సంఘటన జరిగినప్పుడు ముందడుగు వేయాలి. వయసుతో నిమిత్తం లేకుండా పసికందు నుండి మొదలుకొని ముసలి వాళ్ళ వరకు కూడా ఈ ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. మనుషుల్లో మానవత్వం విలువలు లోపించిన తరుణంలో కొత్త మార్పుకై ఈ లోకం ఎదురుచూస్తుంది.

***



**డాక్టర్ రాధా కుసుమ గారికి,**

**కుసుమ జయభేరి మాసపత్రిక నవంబర్, 2024**

డాక్టర్ రాధా కుసుమ గారి ఆధ్వర్యంలో వెలువడిన "కుసుమ జయభేరి" మొదటి నవంబర్ 2024వ మాస పత్రిక సర్వాంగ సుందరంగా సువర్ణ భూషితంగా చాలా బాగుంది. వ్యాసాలు, కవితలు, కథలు, వంటిల్లు మరియు హాస్య తరంగాలు అంతరంగాన్ని తట్టాయి. మీరు ప్రచురించిన ఇటీవలి కార్యక్రమాల ఫొటోలు కూడా ఆకర్షణీయంగా ఉన్నాయి.

మీ తాత గారు నడిపిన "జయభేరి" పత్రిక పేరుతో "కుసుమ జయభేరి" మాసపత్రికగా నామకరణం చేసి మీరు పత్రికా రంగంలో ప్రవేశించటం చాలా సంతోషకరమైన విషయం.

మీ మాసపత్రిక ముందుముందు సాహిత్యలోకంలో మంచి పేరుప్రఖ్యాతులు పొందాలని కోరుకుంటున్నాను. మీ డిసెంబరు మాసపత్రిక కోసం ఎదురుచూస్తున్నాను.

ఇట్లు

**గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్,**

# నడి సంద్రాన కురిసే వెన్నెల

నడి సంద్రాన కురిసే వెన్నెల వల్ల ఎవరికి సంతోషం,మరెవరికానందం..
అలలపై తళుకు బెళుకులను ఒలికించడం తప్ప ఎవరిని అలరిస్తుంది,
మైమరిపిస్తుంది..
ఎదురుగ ఉన్న సౌందర్యాన్ని అభివర్ణించలేని మనసు లేనప్పుడు..
ఒకరి పురోభివృద్ధికి కనీసం నీ వంతుగా చేయూతనివ్వలేనప్పుడు..
ఒకరి ఉన్నతికి కనీసం అభినందనలు ఆశీస్సులు అందివ్వలేని దుస్థితిలో ఉన్నప్పుడు..
చక్కటి కవిత్వాన్ని అభినందించే సహృదయత కొరవడినప్పుడు..
ఓపక్క సాయం చేస్తూనే మరోపక్క హేళన చేస్తూ పైశాచికానందం
పొందుతున్నప్పుడు.
నీలోని అభిప్రాయాలను స్వేచ్ఛగా,స్వచ్ఛంగా వెలిబుచ్చలేని స్థితిలో ఉన్నప్పుడు..
ప్రేమించిన హృదయాన్ని గుర్తించకపోగా గాయపరిచి,మాటలతో వేధించినప్పుడు...
ఓపక్క పొగడ్తలకు పొంగిపోతూ, తామరాకుపై నీటిబొట్టని చెబుతూంటే..
ఎంత జ్ఞానివైనా నీ తెలివితేటలు* *ఎవరికీ ఉపయోగపడనప్పుడు..
కనీసం పంచలేనప్పుడు.
తినడానికి కొదువ లేకున్నా ఒంటినిండా రోగాలు పట్టి పీడిస్తున్నప్పుడు..
నా హృదయం సముద్రమంటూనే ఎవ్వరికీ ప్రవేశము లేదంటూంటే..
ఎంత సంపాదనున్నా అపాత్ర దానముతో అంతా వృధా అయినప్పుడు.
భయం భయంగా ఏమంటే ఏమవుతుందోనని
బిక్కుబిక్కుమని మనసును చంపుకుని బ్రతుకుతూంటే..
సమాజంలో అసలు నువ్వెవరో ఎవరికీ తెలియనప్పుడు,నీ ఉనికికే
అర్థం లేనప్పుడు..
నీ జన్మకు సార్థకత ఎక్కడుంది,
నీ పుట్టుకే నిరర్థకము, నిష్ప్రయోజనము కాదా..
నడి సంద్రాన కురిసే వెన్నెల ఎంత నిరుపయోగమో నీ జీవితమూ అంతే కదా..!!

డా.మరుదాడు అహల్యా దేవి

